క్లుప్తంగా

ఆర్డీవో కార్యాలయం ఎదుట బీడీ కార్మికుల ఆందోళన


ఆందోళన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మెట్‌పల్లి: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట శనివారం శ్రామిక శక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు ఎస్ లక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4 వేలు పెన్షన్ ఇవ్వాలని, కటాఫ్ తేదీ లేకుండా కొత్త పెన్షన్ మంజూరు చేయాలన్నారు. పదవీ విరమణ పొందిన కార్మికులకు కేంద్ర ప్రభుత్వం రూ.7వేల పెన్షన్ ఇవ్వాలని, పేద కార్మికులకు డబుల్ బెడ్ రూం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లత తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసం షీ టీం నిఘా


అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

జగిత్యాలక్రైం: జిల్లాలో మహిళల రక్షణ కోసం షీ టీం నిరంతరం పనిచేస్తుందని షీ టీం ఏఎస్సై అలీబేగ్ అన్నారు. మహిళలపై జరిగే నేరాలపై శనివారం పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ మహిళ వెల్ఫేర్ హాస్టల్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మహిళల రక్షణకై వారి రక్షణకై నేరాలను అరిగట్టడమే లక్ష్యంగా షీ టీం పనిచేస్తుందన్నారు. మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా షీ టీం నెంబర్ 87126 70783 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుళ్లు సౌజన్య, పూజిత పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్,మెమొరీ టెస్ట్,పలు అంశాలపై పరీక్ష నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు హిందీ భాషా ప్రాధాన్యతను వివరించారు.కార్యక్రమంలో హెచ్ఎం జితేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయులకు సన్మానం

రాయికల్: జాతీయ హిందీ భాష దినోత్సవం సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో శనివారం రాయికల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులు వసంతరావు, రాపర్తి నర్సయ్య, కూరగాయల సురేశ్‌లను మండల నోడల్ అధికారి శ్రీపతి రాఘవులు సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రమేశ్, మండల అధ్యక్షుడు గంగరాజం, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో గొర్రెలు, మేకల నమోదు

జగిత్యాల: భారత పశుదాన్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో గొర్రెలు, మేకల నమోదు చేస్తున్నట్లు వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి పూర్ణచందర్ అన్నారు. శనివారం బాలపల్లిలో గొర్రెలు, మేకల సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గ్రామంలో 2084 గొర్రెలు, 324 మేకలు ఉన్నట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరు అందులో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఇంటర్ యోగాసన స్పోర్ట్స్‌కు కేజీఆర్ విద్యార్థులు



జగిత్యాల: తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో జరుగనున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌కు జగిత్యాల కేజీఆర్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికై నట్లు కరస్పాండెంట్ గంగారెడ్డి తెలిపారు. విద్యార్థులు భవితరిణి, రియశ్రీ, అద్వైత, సహస్ర, సాయిప్రణయ్, అభిరాం పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సనత్, వైస్ ప్రిన్సిపల్ శారద పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధుల టెండర్‌కు మోక్షమెప్పుడో?

- నిరుపయోగంగా నిధులు
- అభివృద్ధికి నోచుకోని పార్క్, బస్‌షెల్టర్, జిమ్
- మరికొద్ది రోజుల్లో నిధులు వెనక్కి వెళ్లే అవకాశం


బస్‌షెల్టర్ లేని రాయికల్ పాత బస్టాండ్

రాయికల్: దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా మారింది రాయికల్ పట్టణ అభివృద్ధి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి సీఎండీగా ఉన్న శ్రీధర్ రాయికల్ మున్సిపల్ అభివృద్ధి కోసం సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.30 లక్షల నిధులు కేటాయించారు. టెండర్‌కు నోచుకోకపోవడంతో అభివృద్ధి పనులకు మోక్షం కలగడం లేదు. పట్టణంలో రూ.30 లక్షల నిధుల్లో భాగంగా రూ.20 లక్షలతో పార్క్, రూ.5 లక్షలతో బస్‌షెల్టర్, రూ.5 లక్షలతో ఓపెన్‌జిమ్ కోసం నిధులు కేటాయించారు. ఈ నిధులను కేటాయించినప్పటికీ, టెండర్లు చేపట్టక నిధులు సైతం మరికొద్ది రోజుల్లోనే వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. రూ.9 లక్షల నిధులు బ్యాంకులో జమైనప్పటికీ వినియోగానికి నోచుకోవడం లేదు. టెండర్ కాకపోవడంతో ఈ నిధులు కూడా వెనక్కి వెళ్లే అవకాశం ఉంది.

రూ.30లక్షలతో పనుల ఎంపిక

రూ.30 లక్షల సీఎస్సార్ నిధులకు గాను రూ.20 లక్షలతో రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో పార్క్, ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట రూ.5 లక్షలతో బస్‌షెల్టర్, పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న హనుమాన్ ఆలయం వద్ద రూ.5 లక్షల నిధులతో ఓపెన్ జిమ్ కోసం మున్సిపల్ పాలకవర్గం తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపించారు. ప్రతిపాదనలు పంపించినప్పటికీ టెండర్‌కు నోచుకోకపోవడంతో మరో మూడు నెలల్లో తమ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఈ నిధులు సైతం వెనక్కి వెళ్లే అవకాశం ఉందని పాలకమండలి సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయికల్ పాత బస్టాండ్‌లో బస్‌షెల్టర్‌ను నిర్మిస్తే ఎంతో మంది ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిర్మించాల్సిన బస్‌షెల్టర్‌ను పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేస్తే వర్షానికి, ఎండకు సైతం ఇబ్బందులు కలగకుండా ఉంటుందని, దీనిపై మున్సిపల్ పాలకవర్గం చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్పందించి సీఎస్సార్ పనులకు టెండర్ నిర్వహించేలా సీఎండీ అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నారు.

టెండర్ కోసం ప్రయత్నిస్తున్నాం



సింగరేణి సీఎండీగా శ్రీధర్ ఉన్న సమయంలో నిధుల గురించి కలిశాను. రాయికల్ మున్సిపల్ అభివృద్ధి కోసం రూ.30 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో పనులకు స్థలాలను సైతం ఎంపిక చేశాం. టెండర్‌కు నోచుకోకపోవడంతో పనులు జరగడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి టెండర్ నిర్వహించాలి.
– మోర హన్మండ్లు, మున్సిపల్ చైర్మన్

ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలి



రాయికల్ పట్టణ ప్రజలకు క్రీడాకారులకు వాకర్స్‌కు అందరికీ అందుబాటులో ఉండేలా ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా పాతబస్టాండ్‌లో బస్‌షెల్టర్ పాటు, గాంధీచౌక్ వద్ద నిర్మాణం చేపడితే ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంటుంది. ప్రజాప్రతినిధులు స్పందించి టెండర్ల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి.
– గరిపెల్లి శ్రీనివాస్

బీజేపీ సభ్యత్వ నమోదుపై నాయకులు దృష్టి సారించాలి


యువకుడికి సభ్యత్వం ఇస్తున్న వికాశ్‌రావు

కథలాపూర్: బీజేపీ సభ్యత్వ నమోదుపై నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. శనివారం కథలాపూర్ మండలకేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ బూత్‌లో 200 మందికి పైగా సభ్యత్వం చేయించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు కంటి సత్యనారాయణ, నాయకులు వెంకటేశ్వర్‌రావు, బద్రి సత్యం, గాంధారి శ్రీనివాస్, కాసోజి ప్రతాప్, ఆనందొరెడ్డి, జీవన్‌రెడ్డి, జిల్లా సత్యం పాల్గొన్నారు.

మేడిపల్లిలో..

మేడిపల్లి: మండల కేంద్రంలో శనివారం బీజేపీ వేములవాడ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. గ్రామాల్లో బీజేపీ పార్టీ చేసిన పనులను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వం నమోదు చేపించాలని తెలిపారు. శక్తికేంద్రం, గ్రామ ఇన్‌చార్జీలు నాయకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కోరుట్ల ఇన్‌చార్జి సురభి నవీన్‌కుమార్, కన్వీనర్ క్యాతం దశరథరెడ్డి, మధుకర్, మండల అధ్యక్షుడు ముంజ శ్రీనివాస్, అన్నాడి జలపతిరెడ్డి, పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలతో ఆధ్యాత్మికత


మల్యాలలో పూజలు చేస్తున్న సుంకె రవిశంకర్

మల్యాల: గణేశ్ నవరాత్రోత్సవాలతో ఆధ్యాత్మికత పెంపొందుతుందని, యువత ఐకత్యకు తోడ్పడుతాయని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మల్యాల మండల కేంద్రంలోని పలు గణేశ్ మంటపాల్లో శనివారం ఆయన పూజలు చేశారు. గణేశ్ ఉత్సవాలు ఐక్యతకు నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో అయిల్నేని సాగర్‌రావు, జనగం శ్రీనివాస్, గడ్డం రాజేశం పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలి

కోరుట్ల: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. కోరుట్ల పట్టణంలో వినాయక ఉత్సవాలు ఘనంగా జరుపుకునే సంస్కృతి ఏళ్ల తరబడి ఉందన్నారు. కోరుట్ల యువత సమాజానికి మంచి సందేశాలనిచ్చే వినాయకులను ప్రతిష్ఠించడం అభినందనీయమని, నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

ఆకుకూరలు, చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు


అవగాహన కల్పిస్తున్న అధికారులు

సారంగాపూర్: ఆకుకూరలు, చిరుధాన్యాలు ఆరోగ్యానికి అత్యంత మేలు చేస్తాయని సీడీపీవో వాణిశ్రీ అన్నారు. శనివారం సారంగాపూర్ రైతువేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల్లో అనేక పోషకాలు ఉంటాయని, ఆకుకూరల్లో ఉన్న విటమిన్స్, అంగన్‌వాడీ పాఠశాలల్లో అందించే బాలామృతం , ఆరోగ్యలక్ష్మీ పుడ్ బాలింతలకు, చిన్నారులకు, తల్లులకు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లత, శైలజ, నీలిమా, అండాలు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన జీవితం

పెగడపల్లి: ఆరోగ్యవంతమైన జీవితం కోసం ప్రతి ఒక్కరు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ పోషకాహార మాసోత్సవాలు ఘనంగా జరిపారు. కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులకు అన్న ప్రాసన, సామూహిక అక్షరభ్యాసం, గర్భిణులకు సీమంతం చేశారు. మండలంలోని ఆరవెల్లిలో వినాయకుడి మంటపం వద్ద పౌష్టికాహారంపై తల్లులతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుబాయిలో గణేశ్ ఉత్సవాలు



కథలాపూర్: ఉపాధి నిమిత్తం దుబాయిలో ఉంటున్న జిల్లాలోని కథలాపూర్, కోరుట్ల, మెట్‌పల్లి, మేడిపెల్లి మండలాలకు చెందిన యువకులు వినాయకుడి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దుబాయిలో బార్ దుబాయి ఏరియాలో గత 5 ఏళ్లుగా వినాయకుడి ఉత్సవాలు నిర్వహించి.. నిమజ్జనోత్సవాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నామని యువకులు పేర్కొన్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడలు


విజేతలతో ఎస్సై అనిల్, పీడీలు, పీఈటీలు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండలస్థాయి క్రీడలు శనివారం ముగిశాయి. అండర్–14, 17 విభాగాల్లో వేర్వేరుగా క్రీడలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించాలని జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు పిట్టల వంశీ మిత్రబృందం రూ. 15 వేలు విలువ గల కప్పులను, మెడల్స్‌ను బహుమతులుగా అందించారు. కార్యక్రమంలో ఎస్సై అనిల్, హెచ్ఎం రాజన్న, పీడీలు రాజు, అశోక్, పీఈటీలు సరిత, ప్రవీణ్ పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: వెల్లుల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన ఎస్‌జీఎఫ్ మెట్‌పల్లి మండలస్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులు,మెడల్స్‌ను అందజేశారు. విద్యార్థులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం రవీందర్, ఫిజికల్ డైరెక్టర్లు కొమురయ్య, అశోక్, చక్రధర్, రవి, మాజీ ఎంపీపీ సాయిరెడ్డి, మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు చీరలే రక్షణ



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలంలో మొక్కజొన్న సాగుచేసిన రైతులు రక్షణ కోసం చీరెలను, వలలను కడుతున్నారు. కోతులు, అడవి పందుల బెడద నుంచి కాపాడుకోవాలని ఇలా చేశామని రైతులు తెలిపారు.

ప్రత్యేక బీమా కల్పించడం అభినందనీయం

జగిత్యాల: కేంద్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్లకు వైద్యం కోసం ప్రత్యేక బీమా కల్పించడం అభినందనీయమని సీనియర్ సిటిజన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. శనివారం సీనియన్ సిటిజన్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగిత్యాల జిల్లాలో 50 వేల మందికి కేంద్ర బీమా లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో విశ్వనాథం, ప్రకాశ్, విజయ, హన్మంతరెడ్డి, యాకూబ్, శివానందం, రాజేశ్వర్, విఠల్, సతీశ్‌రాజ్ పాల్గొన్నారు.

పూజ సామగ్రి విక్రయాలకు వేలం

మెట్‌పల్లిరూరల్: మండలంలోని గండి హనుమాన్ ఆలయంలో పూజ సామగ్రి విక్రయాలకు ఈ నెల 16న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో విక్రమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది కాలపరిమితికి గాను నిర్వహించే ఈ వేలంలో పాల్గొనేవారు ముందస్తుగా రూ.20 వేలు డిపాజిట్ చెల్లించాలని, సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఆలయ ఆవరణలో వేలం ఉంటుందని పేర్కొన్నారు.

కళాకారులకు సన్మానం

రాయికల్: మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన ఊరె నర్సయ్య తన కళానైపుణ్యంతో వెదురు బొంగులను ఉపయోగించి వినాయకుడిని తయారు చేశాడు. అదే గ్రామానికి చెందిన మరో కళాకారుడు కొమ్ము దిలీప్, నర్సయ్యను శనివారం విజేత స్పోర్ట్స్ క్లబ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జక్కుల చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


ఆర్యవైశ్య సంఘంలో అమ్మవారి ప్రత్యేక అలంకరణ

కోరుట్ల: పట్టణంలోని సంకల్ప విఘ్నేశ్వర ఆలయంలో వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం శివ పార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

ఘనంగా కుంకుమార్చన

పట్టణంలోని ఆర్యవైశ్య సంఘంలో వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి అమ్మవారికి కుంకుమార్చన, గణనాథుడికి పవలింపు సేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ప్రత్యేక అలంకరణ ఆకట్టుకుంది.


మల్లాపూర్‌లో కుంకుమ పూజలో మహిళలు


జగిత్యాలరూరల్: 108 రకాల నైవేద్యాలు

వినాయకుడికి ప్రత్యేక పూజలు, అన్నదానాలు

జగిత్యాలటౌన్/ జగిత్యాల రూరల్/కోరుట్ల/ధర్మపురి/మెట్‌పల్లిరూరల్/రాయికల్/మల్లాపూర్/మేడిపల్లి: జిల్లా వ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమపూజలు, అన్నదానం చేశారు. రకరకాల నైవేద్యాలతో వినాయకుడికి సమర్పించారు. కోరుట్ల పట్టణంలో పలు యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసిన గణనాథులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.


ధర్మాజీపేటలో డ్రాగన్ యూత్ సభ్యుల పూజలు


ధర్మపురిలో భక్తుల పూజలు


జగిత్యాల టౌన్: పూజలు చేస్తున్న మహిళలు


బండలింగాపూర్‌లో ఆకట్టుకుంటున్న గణపతి



సారంగాపూర్: జగిత్యాల నుంచి సారంగాపూర్, బీర్‌పూర్, ధర్మపురి నుంచి వెళ్లే జాతీయ రహదారిపై తిప్పన్నపేట స్టేజి వద్ద రోడ్డుపై లోతైన గుంతలు ఏర్పడ్డాయి. ఇక్కడ ధర్మపురి, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల నుంచి వచ్చే రహదారులు ఈ గుంతకు సమీపంలోనే కలసిపోతాయి. వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న గుంతలో పడిపోయినా, లేదా హెచ్చరికల కోసం ఏర్పాటు చేసిన కర్రలు ద్విచక్ర వాహనదారులకు కుచ్చుకున్నా మనిషి ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఇంది. వెంటనే గుంతలు పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ఈ సమస్యపై సంప్రదించాల్సిన అధికారి
లక్ష్మణ్, జేఈ, (జాతీయరహదారి) సెల్ నం: 9959262728

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 94400 61630, 9705346643

ఘనంగా గోపాల కాలువలు

ధర్మపురి: మండలంలోని తీగలధర్మారంలో శనివారం గోపాల కాలువలను ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం శ్రీ ఆంజనేయ స్వామి భక్త మండలి ఆధ్వర్యంలో వేడుకల సందర్భంగా ఆలయంలో ఆంజనేయ స్వామి అభిషేకం, చందన ధారణ, 24 గంటలు ఏక నామస్మరణ, భజనలు గావించారు. చిన్నారులను వివిధ వేశాధారణలతో చూడముచ్చటగా అలంకరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు లింబాద్రి, మాజీ సర్పంచ్ జంగిలి ప్రభాకర్, గంధం గంగారాం, పందిరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓనం వేడుకలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌లో కేరళకు చెందిన ఉపాధ్యాయులు ఘనంగా ఓనమ్ పండగను నిర్వహించారు. కేరళ ఆచార సాంప్రదాయాలతో పండగ చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మానికరావు, అజిత, మోలిబీజు, రాజేశ్, అనురాగ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఫ్రెషర్స్ డే

కోరుట్ల: పట్టణంలోని శ్రీ అరుణోదయా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి, ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ పోతని ప్రవీణ్, ప్రిన్సిపాల్ నవీన్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ భవాని,అధ్యాపకులు పాల్గొన్నారు.

రాయికల్‌లో నిమజ్జన వేడుకలు

రాయికల్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ప్రతిష్ఠించిన గణనాథున్ని శనివారం వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఠాణాలో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులంతా కలిసి డప్పు చప్పుళ్ల మధ్య గణనాథున్ని శోభాయాత్రగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్, పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

175 మంది బైండోవర్

మెట్‌పల్లి: వినాయక నిమజ్జనం సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలో 175మందిని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా జరగాలనే ఉద్దేశ్యంతో రౌడీ షీటర్లు, డీజే నిర్వాహకులు, అల్లర్లు సృషించే అవకాశమున్న వారిని గుర్తించి బైండోవర్ చేశామన్నారు. నిబంధనల మేరకు నిమజ్జనం మధ్యాహ్నం 12గంటలకు మొదలుపెట్టి రాత్రి 11గంటల లోపు ముగించాలన్నారు.